# అసలు స్వరూపం

**“హలో సంధ్యా, నేను రఘుని మాట్లాడుతున్నాను. మన చైతన్య స్లీపింగ్ పిల్స్ మింగి ఆత్మహత్య చేసుకోబోయాడు. సమయానికి ఆనంద్ చూసి హాస్పిటల్‌లో జాయిన్ చేశాడు...” మిగతా మాటలేవీ సంధ్యకి వినబడటం లేదు.**

‘చైతన్య...మైగాడ్... ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడా?’ సంధ్యకి తల గిర్రున తిరుగుతోంది. కాళ్లు, చేతులు వణుకుతున్నాయి. వళ్లంతా చమటతో తడిసిపోయింది. ఓపిక లేనట్లు నిస్సత్తువుగా సోఫాలో కూలబడింది.

★ ★ ★

సంధ్య సుడిగాలిలా హాస్పిటల్‌లోకి దూసుకుని వచ్చింది.

“చైతన్యా! నీకేమైనా పిచ్చిపట్టిందా? ఒక సంవత్సరం ఆగితే మన చదువులు అయిపోతాయి. ఇద్దరం ఉద్యోగాలు సంపాదించుకుని పెళ్లి చేసుకుందామని అనుకున్నాము. ఇంతలోనే ఏ కష్టం వచ్చిందని ఇలాంటి వెధవ పనికి సిద్ధపడ్డావు? చదువు, సంస్కారం వున్నవాడివి. ఎందుకు చైతన్యా ఈ నిర్ణయం తీసుకున్నావు? అసలు నీకేమైనా పిచ్చి పట్టిందా?” కళ్లలో కళ్లు పెట్టి ఆవేశంగా అడుగుతున్న సంధ్యకి ఏం సమాధానం చెప్పాలో తెలియనట్లుగా తల వంచుకున్నాడు చైతన్య.

“చైతన్యా! నీకేమైనా అయితే నీ సంధ్య ఎలా బతుకుతుందనుకున్నావు? అసలు ఏమైంది, చెప్పు చైతన్యా?”

పిచ్చిదానిలా వెక్కివెక్కి ఏడుస్తున్న సంధ్యని చూస్తూ “సంధ్యా! ముందు నేను చెప్పింది విను. ఆ తర్వాత నేను చేసింది తప్పో, ఒప్పో నిర్ణయించు” అన్నాడు.

ఏమిటో అంత కష్టం అన్నట్లు ఉక్రోషంగా చూసింది సంధ్య.

“సంధ్యా! మా డాడీ ప్రస్తుతం ఈ సిటీ అంతటికీ నెంబర్‌వన్ అనిపించుకున్న బిల్డర్. ఆయనకు ఆస్తి, హోదా, సంఘంలో గౌరవం అన్నీ వున్నాయి. అయితే సంధ్యా, పదిహేనేళ్ల క్రితం మాది మధ్యతరగతి కన్నా ఒక మెట్టు దిగువనున్న కుటుంబం. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతుండేవాళ్లం. ఆ సమయంలో మా డాడీ స్నేహితుడు సదాశివంగారు మంచి హోదాలో వుండేవారు. ఆయన తన బిజినెస్‌లో పార్టనర్‌షిప్ డాడీకి ఇచ్చి, ఆర్థికంగా ఎంతో సహాయం చేశారు. అలాంటి వ్యక్తి ఈమధ్య వ్యాపారంలో బాగా నష్టపోయి, హార్ట్ ఎటాక్‌తో చనిపోయారు. ఆయన హాస్పిటల్‌లో వున్నప్పుడు డాడీ ఆయన కూతుర్ని తన కోడలిగా చేసుకుంటానని మాటిచ్చారట.

“నువ్వుగానీ ఆ అమ్మాయిని చేసుకోకపోతే ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని అసమర్ధుడిగా వుండటం కంటే చనిపోవడమే మంచిదని తను ఆత్మహత్య చేసుకుంటానని డాడీ అంటున్నారు. సంధ్యా! ఆయన చాలా మొండి మనిషి. తన మాట విననందుకు సొంత తల్లితోనే అయిదేళ్లు మాట్లాడడం మానేశారు. నేనుగానీ ఆయన చెప్పినట్లు వినకపోతే అన్నంత పని చేసితీరుతారు. చేసుకుంటాను అని చెప్పి నిన్ను మోసం చెయ్యలేను. చేసుకోను అని చెప్పి ఆయన్ని శాశ్వతంగా దూరం చేసుకోలేను. ప్రస్తుత పరిస్థితుల్లో నా చావే పరిష్కారంగా కనిపించింది. ఇప్పుడు చెప్పు సంధ్యా, నేను చేసింది తప్పా? తప్పనిపిస్తే పరిష్కారం కూడా నువ్వే చెప్పు.”



తన జీవితంలో ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని కలలో కూడా వూహించని సంధ్య మాటలు రానట్లు స్థబ్దంగా వుండిపోయింది. చైతన్య రెండు చేతులతో తల పట్టుకుని కూర్చున్నాడు.

పది నిమిషాల మౌనాన్ని ఛేదిస్తూ “చైతూ! త్వరలో నీ పెళ్లికార్డు పంపిస్తావు కదూ!” కన్నీళ్లు బుగ్గల్ని అభిషేకం చేస్తుంటే గబగబా హాస్పిటల్లో నుంచి బయటకు వచ్చింది సంధ్య.

★ ★ ★

“ఛీర్స్” చైతన్య, రఘు, ఆనంద్ చేతుల్లోని గ్లాసులు ఒక్కసారి పైకి లేచాయి. ప్లేటులోని చిల్లీచికెన్ ముక్కల్ని తింటూ “అదేంటి చైతన్యా! సంధ్యతో అంత పెద్ద అబద్ధం చెప్పావు” అడిగాడు రఘు. గ్లాసులోనిదంతా ఒక్కసారి గొంతులో పోసేసుకుని, గ్లాసు టేబుల్ మీద పెడుతూ “అబద్ధం చెప్పకుండా, ‘అమ్మా సంధ్యా! నేనొక కోటీశ్వరుడి కూతుర్ని పెళ్లి చేసుకుంటాను. నువ్వు నన్ను మర్చిపో. ఏ గుమస్తానో చేసుకుని హాయిగా వుండు’ అని చెప్పాననుకో- అప్పుడు సంధ్య భద్రకాళిలా రెచ్చిపోయి, నా రెండు చెంపల్నీ ఎడాపెడా వాయించేసి ‘నాలుగేళ్లు నాతో తిరిగి ఇప్పుడు వేరే అమ్మాయిని చేసుకుంటావా?’ అంటూ నానా హంగామా చేస్తుంది. పదిమందిలో నా పరువు తీస్తుంది. అందుకేరా ఫ్రెండ్- చిన్న సెంటిమెంటల్ టచ్ ఇచ్చి, తనతోనే నా కాబోయే పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇప్పించాను. ఎలా వుంది మన డ్రామా. పాపం పిచ్చిమొద్దు... నేను నిజంగా ఆత్మహత్య చేసుకోబోయానని నమ్మేసింది. అయినా లక్ష్మీదేవి ఇంట్లోకి అడుగుపెడతానంటుంటే ‘వద్దు’ అని చెప్పి ఏమీలేని సంధ్యని నా జీవితంలోకి ఎలా ఆహ్వానిస్తానురా?”

“అరేయ్ ఆనంద్ గ్లాసు నింపరా!” మత్తుగా అరిచాడు చైతన్య.

“చైతన్యా యు ఆర్ గ్రేట్!” ఒక్కసారి అన్నారు స్నేహితులిద్దరూ. అంతవరకూ గోడ పక్కనుంచి అంతా విన్న సంధ్య గబగబా హేండ్‌బ్యాగ్ నుంచి కాగితం తీసి “చైతన్యా! నిన్నటివరకూ నీతో జీవితం పంచుకోలేకపోయినందుకు పిచ్చిదానిలా ఏడ్చాను. కానీ నేనెంత అదృష్టవంతురాలినో ఈరోజే తెలిసింది. అందుకు ఆ దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. నా పుట్టినరోజున నువ్వు నాకు ప్రెజెంట్ చేసిన ఉంగరాన్ని తిరిగి ఇవ్వడానికి వచ్చాను. నీ అసలు స్వరూపం కూడా తెలుసుకున్నాను. నీలాంటివాడికి దూరం అవడం చాలా చాలా ఆనందంగా వుంది. సెలవ్.

-సంధ్య

కాగితాన్ని, ఉంగరాన్ని పక్కనే వున్న టీపాయ్ మీద వుంచి ప్రశాంతంగా అడుగు బయటకు వేసింది.

మబ్బుల చాటునుంచి బయటపడిన చంద్రుడు వెన్నెల వర్షాన్ని కురిపిస్తున్నాడు.

**-డి.స్వర్ణశైలజ (ఖరగ్‌పూర్)**